

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 02 డిశంబర్ 2024 పేజీలు : 04

# వైఎస్ఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి..

- పూర్తి స్థాయి అవకాశం వస్తే హిందూపురం అభివృద్ధి చేస్తా
- మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

**హిందూపురం డిసెంబర్ 1 ప్రభాతవార్త**

మహా నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో రాజకీయ రంగంలో ప్రవేశించానని హిందూపురం మున్సిపల్ చైర్మన్ మాదిరెడ్డి బలరామిరెడ్డి వెల్లడించారు. రానున్న రోజుల్లో తనకు భగవంతుడు అవకాశం ఇస్తే హిందూపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రూపురేఖలే మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు.



ఎం. బలరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్

స్థానిక చైర్మన్ పదవి నాలుగు నెలలుగా ఖాళీగా ఉండడంతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల చట్ట ప్రకారం నూతన చైర్మన్ ఎన్నుకునేంతవరకు వైస్ చైర్మన్ బలరాంరెడ్డిని పూర్తి స్థాయి చైర్మన్ గా నియమిస్తూ ఇటీవల మున్సిపల్ డిఎంఎ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. అనూహ్య పరిస్థితుల్లో మున్సిపల్ చైర్మన్ గా నియమితులైన బలరాం రెడ్డి బాలయేసు కళాశాల ప్రిన్సిపాల్ గా అటు తన వృత్తి విద్యారంగంలో, ఇటు ప్రవృత్తి రాజకీయ రంగంలోనూ సక్సెస్ అయ్యారని సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. కర్నూలు జిల్లా ఆవుకు మండలం రాఘవ రాజపురం(పెద్ద కొట్టాల) లో 1964 డిసెంబర్ 10 న సోమక్క, మాదిరెడ్డి పెద్ద నారాయణరెడ్డి దంపతులకు జన్మించిన బలరాంరెడ్డికి ఇద్దరు అక్కలు, ఒక చెల్లి ఉన్నారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్య, అవుకులో హైస్కూల్, బనగానపల్లి లో ఇంటర్మీడియట్ చేశారు. నంద్యాల ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, గణిత శాస్త్రంలో పీజీ, బి.ఎడ్ అభ్యసించారు. 1989లో హిందూపురం వచ్చి స్థిరపడ్డారు. తన మామ కొండారెడ్డి నిర్వహణలోని బాలయేసు విద్యాసంస్థలో హైస్కూల్, డిగ్రీ, పీజీ కాలేజ్ ల్లో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్ గా సేవలు అందిస్తూ విజయవంతమైన గురువుగా మన్ననలు పొందారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ, గోరంట్ల తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు బలరామిరెడ్డి విద్యా బోధనలో అభ్యసించి నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

బలరామిరెడ్డి కుమారుడు రవితేజరెడ్డి దంపతులు హైదరాబాదులో సాఫ్ట్ వేర్ రంగంలో ఉండగా, కుమార్తె డాక్టర్ సుష్మలత దంపతులు స్థానికంగా విశ్వతేజ హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. తనకు మున్సిపల్ చైర్మన్ పదవి తాత్కాలికంగా వచ్చినప్పటికీ తనకున్న సమయంలోనే హిందూపురంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. వైఎస్ఆర్ స్ఫూర్తితో నా వంతుగా ప్రజలకు ఏదైనా మేలు చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని, భవిష్యత్తులో తనకు మంచి అవకాశం వస్తే హిందూపురానికి ఔటర్ రింగ్ రోడ్డు, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్థానని, అనేక అభివృద్ధి ప్రణాళిక ఆలోచనలు ఉన్నాయని అన్నారు.

## జంతువుల కన్నా హీనంగా ప్రవర్తిస్తే

# సహించేది లేదు జేసీ ప్రభాకర్ రెడ్డి

- ప్రాణాలుంటే ఉంటాయ్..పోతే పోతాయ్
- నీ మాఫియాకు తావివ్వం
- తాడపత్రిలో అమాయకులను మాఫియా గా తయారు చేస్తున్నావ్
- నా ఆస్తులపై విచారణకు సిద్ధం
- దమ్ముంటే నీ ఆస్తులు పై కూడా విచారణ కు సిద్ధమా
- నిర్భయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతాం
- తాడపత్రి లో కూడా జిల్లా అధ్యక్షునిగా మీటింగ్ పెట్టి తీరుతా
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త బ్యూరో**

టిడిపి నేత, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పై వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన ఆరోపణపై అనంత ఘాటుగా స్పందించారు.మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు భయపడం. ప్రాణం అందరికీ ఒక్కటే. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాట చేయడానికి వెనుకాడం అంటూ తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు, అవినీతి ఆరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంత వెంకటరామిరెడ్డి ఏమన్నారంటే ˇ మా తల్లిదండ్రులు మమ్మల్ని పెంచినప్పుడు గానీ, మాకు చదువు చెప్పిన గురువులు గానీ మాకు సంస్కారం నేర్పారు. ఆ సంస్కారంతో పెరిగే సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాం. ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా ఒకేరకంగా ఉన్నా. గెలిచినప్పుడు విర్రవీగలేదు. ఓడిపోయాక కుంగిపోలేదు. ప్రజల సమస్యలే మా సమస్యలుగా అధికారంలో ఉన్నప్పుడు కూడా మాట్లాడాం. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నా, ముఖ్యమంత్రిగా విజయభాస్కర్‌రెడ్డి ఉన్నా.. పార్లమెంట్‌లో మా పార్టీ అధికారంలో ఉన్నా సమస్యలపై మాట్లాడినోళ్లం. నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశం ఇస్తే నాకు చేతనైనంతలో అభివృద్ధి చేశాం. తెలుగుదేశం పార్టీ నేతలతో సహా బీజేపీ, వామపక్షాలు, మేధావులు, పాత్రికేయులు ఎప్పుడు విమర్శలు చేసినా అందులో సద్విమర్శలను తీసుకుని వాటిని సరిదిద్ది జిల్లాను బాగు చేశాం. ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితి గురించి మొన్న ప్రెస్‌మీట్‌లో మాట్లాడా. ఎక్కడ చూసినా అవినీతి జరుగుతోందని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదని అన్నాను. ఒకరిని ఉద్దేశించి కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుక, మట్టి, మద్యం, బూడిద వ్యాపారంలో ఉన్నారని చెప్పా. ఈ విషయాలన్నీ పత్రికలు ఘోషించినవే..! ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చినవే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కూడా వాళ్ల పార్టీ మీటింగ్స్‌లో చెప్పారు. చంద్రబాబు చెప్పినా పరిస్థితి మారలేదనే మేం మాట్లాడాం. వాయిస్ ఆఫ్ ది పీపుల్‌గా మాట్లాడాం. కానీ, సభ్యసమాజం తలదించుకునేలా, వావివరసలు లేకుండా మాకంటే వయసులో పెద్దవాడైన జేసీ ప్రభాకర్‌రెడ్డి మమ్మల్ని వ్యక్తిగతంగా మాట్లాడారు. తాడిపత్రిలో అమాయకులను మాఫియాగా తయారు చేసి మాటల దాడులు చేస్తున్నారు. పది రోజుల క్రితం నేను రైతుల సమస్యలపై మాట్లాడాను. ఆ తర్వాత కాలవ శ్రీనివాసులు కూడా రైతుల సమస్యలపై మాట్లాడారు. గిట్టుబాటు ధర లేదని చెప్పారు. అదే విషయాన్ని చెబితే నాపై అసభ్యంగా మాట్లాడించారు. నేనే కాదు, వాళ్ల పార్టీ వాళ్లు మాట్లాడినా.. ఇతర పార్టీల వాళ్లు మాట్లాడినా ఇదే వ్యవహారం. నేను భూములు కాజేశానని, అవినీతి చేశానని ఆరోపణలు చేస్తున్నారు. మా ఇంట్లో 12 సార్లు మా తండ్రి, నేను ప్రజాప్రతినిధిగా ఉన్నాం. ఇప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నారు. మీరు చేసిన ఆరోపణలపై విచారణ చేయండి. నేను సహకరిస్తా. మా తల్లిదండ్రులకు వచ్చిన ఆస్తిని అమ్మి భూములు కొన్నాం. మా నాయన కట్టించిన ఇంట్లోనే ఇప్పటికీ మేం ముగ్గురు అన్నదమ్ములున్నాం. 57 ఏళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నాం. ఆ ఇంట్లోనే మీరు పిల్లప్పుడు, నేను పిల్లప్పుడు ఉన్నాం. నీకు నిజాయితీ ఉంటే మీ కుటుంబ ఆస్తులపై కూడా విచారణ కోరండి. నన్ను ఇంటికొచ్చి కొడతాం అని అంటున్నారు. అంత సులభంగా ఉంటుందా? ఐదు మార్లు ప్రజాప్రతినిధిగా ఉన్నా. ఓడిపోయాను.. గెలిచాను. ఓడిపోతే నేను ఏ రోజూ ఊరు విడిచిపెట్టి పోలేదు. గన్‌మన్లలను తీసేసినా మళ్లీ కావాలని కూడా అడగను. నేను ఎక్కడికి వెళ్లినా ఒకడినే వెళ్తా. ప్రతి ఇంట్లోనూ అక్క, చెల్లి, భార్య, తమ్ముళ్లు ఉంటారు. మీలా నేను మాట్లాడను. 1996లో మీరంతా ఊరు విడిచి బెంగళూరుకు వెళ్లిపోతే రఘువీరారెడ్డి, నేను పోరాడాం. వామపక్షాలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆ రోజుల్లో నిలబడ్డాయి. ఆ రోజు తాడిపత్రిలో మీ రాజకీయాన్ని కూడా మేం కాపాడాం. 2004 తర్వాతే మళ్లీ మీరు వచ్చారు. మీలా ఓడిపోయాక పరిగెత్తుకెళ్లి బెంగళూరు, హైదరాబాద్‌కు మేం పోలేదు. అధికారంలో ఉంటే అందరినీ కొడతారు.. తిడతారు.. వ్యాపారాలన్నీ మాకే కావాలంటారు..! ఇప్పుడు తాడిపత్రిలో కొత్త జాడ్యం పట్టుకుంది. అమాయకులను మాఫియాగా తయారు చేసి మాట్లాడిస్తున్నారు. మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు మేం భయపడం ప్రభాకర్‌రెడ్డి. నిర్భయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడతా. తాడిపత్రిలో మాకు, మా పార్టీకి ఓటర్లు ఉన్నారు. జిల్లా అధ్యక్షుడిగా తాడిపత్రికి వెళ్లి మీటింగ్ కూడా పెడతాం. పశువులు, జంతువుల కన్నా హీనంగా ప్రవర్తిస్తే సహించేది లేదు. ప్రాణాలు ఉంటే ఉంటాయ్.. పోతే పోతాయ్.. అంతేగానీ ఇలాంటి వాళ్లకు తావివ్వం. నీ మాఫియాకు కూడా తావవ్వను... ఆ నియోజకవర్గమే కాదు ఏ నియోజకవర్గంలో అయినా సరే ప్రజా సమస్యలపై మాట్లాడతాం. నువ్వు అనంతపురం వస్తా అంటున్నావు.. నిన్ను ఎవరైనా రావద్దంటున్నారా?. నాపై చేసిన ప్రతి ఆరోపణపై విచారణకు సిద్ధంగా ఉన్నా. ఐదేళ్ల కాలంలో అనంతపురంలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి చేశాం. మీ హయాంలో రాంనగర్ బ్రిడ్జిని మీకు తెలిసిన కాంట్రాక్టర్‌తో చేయించారు. మా హయాంలో అనంతపురంలో బ్రిడ్జిని కట్టాం. అక్కడెలా ఉంది? ఇక్కడెలా ఉందో చూసుకోండి. డంపింగ్ యార్డ్‌పై విచారణ చేయాలని ఎప్పుడో చెప్పాం. మా మేయర్ వసీం కూడా మున్సిపల్ మీటింగ్‌లోనే చెప్పారు. అనంతపురంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు మీ పార్టీలోనే ఉన్నారు. వాస్తవాలెంటో తెలుసుకోండి. అనంతపురంలో రోడ్డు వంకరగా ఉందని చెబుతున్నారు కదా..! మీ మాటల్లో నిజాయితీ ఉంటే వంకరగా ఉండే ఆ ఐదు మీటర్లో.. పది మీటర్లో ఈ ఐదేళ్లలో సరిచేయండి. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోండి. చేతనైతే మాకన్నా బాగా అభివృద్ధి చేస్తామని చెప్పండి. తాడిపత్రిలో కూడా మా పార్టీ కార్యకలాపాలు సాగిస్తాం. నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తాం. మీలా గతంలో బెదిరించినోళ్లు జిల్లాలో ఉన్నా మాఫియాను మాత్రం తయారు చేయలేదు. ఇలాంటి మాఫియా జిల్లాకే హానికరం. ఆయనకు కూడా హానికరమే. ఇది మంచిది కాదు. పత్రికల్లో రాస్తే వాళ్లను బెదిరిస్తారు. వాళ్ల పార్టీ వాళ్ల మీదకే వెళ్తారు. అధికారులను బెదిరిస్తారు. ఐఏఎస్, ఐసీఎస్‌లను బెదిరిస్తారు. అందరూ నోరు మూసుకుంటున్నట్లు మమ్మల్ని మూసుకోమంటే కుదరదు. మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు ఎవరూ భయపడం అని తెలిపారు.



# విడపనకల్లు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురు వైద్యులు మృతి

- బ్యాంకాక్ టూర్‌కు వెళ్లిన కర్ణాటకకు చెందిన వైద్యులు
- స్వస్థలాలకు కారులో వెళుతుండగా ప్రమాదం
- పొగమంచు కారణంగా అదుపు తప్పిన కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

**విడపనకల్లు, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వైద్యులు ప్రాణాలు కోల్పోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్రమైన పొగమంచు, అతివేగం కారణంగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మండల కేంద్రంలోని స్థానిక భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో జాతీయ రహదారి-42పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు దుర్మరణం చెందారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి.







ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్లు

విజయనగర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఒపిడి) బళ్లారికి చెందిన ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులు బ్యాంకాక్ విహారయాత్ర ముగించుకుని తిరిగి స్వస్థలానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు కన్నుమూశారు. బళ్లారికి చెందిన ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ యోగేష్, డాక్టర్ గోవిందరాజ, డాక్టర్ అమరేగౌడ విహారయాత్ర కోసం బ్యాంకాక్‌కు వెళ్లారు. విదేశీయాత్ర ముగించుకుని రాత్రి బెంగుళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుండి కారులో బళ్లారికి బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తరువాత అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద జాతీయ రహదారిపై వీరి వాహనం ప్రమాదానికి గురైంది. పొగమంచు కారణంగా వేగంగా వెళుతున్న కారు చెట్టును ఢీ కొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. అతివేగంగా వచ్చి చెట్టును ఢీ కొనడంతో ముగ్గురు వైద్యులు గోవిందరాజ (52), యోగేష్ (54), ప్రైవేటు ఆసుపత్రి మేనేజర్ వెంకటనాయుడు (53) అక్కడికక్కడే మృతి చెందగా అమరేగౌడకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని బళ్లారి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బళ్లారి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఏబివిఎస్‌బి శ్రీనివాస్ పరిశీలించారు.

# ఎయిడ్స్ డే సందర్భంగా పుట్టపర్తిలో భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తదితరులు

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 (ప్రభాతవార్త)**

ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారులు పుట్టపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థినిలతో పాటు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదని, చికిత్స ఉందన్నారు. సాధారణ బిపి, షుగర్ లాంటి చిన్న వ్యాధి అని, ఈ వ్యాధి బారిన పడిన వారికి హెచ్ఐవి 2017 యాక్ట్ అండగా ఉంటుందని తెలియజేశారు. కళాబృందాలచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలని జిల్లాలో నిర్వహించారు. ఛైల్డ్ ఫండ్ ఇండియా స్టాల్ ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజు వాణి మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులతో సహపంక్తి భోజనం కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తామని వివరించారు. జిల్లా ఎయిడ్స్, టీబి అధికారి డా. తి ప్పయ్య మాట్లాడుతూ 15రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాశాలల్లో వివిధ కార్యక్రమాలని నిర్వహిస్తామన్నారు. హెచ్ఐవి బాదితులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి, వైద్యులు సహపంక్తి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్, ఐసిడిఎస్, మెప్మా అధికారులు, మున్సిపల్ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధి కారులు, టీబీ విభాగం సిబ్బంది, జన జాగృతి ప్రాజెక్ట్ డైరెక్టర్ బలరాం, ప్రాజెక్ట్ మేనేజర్లు ఈశ్వరయ్య (ఎస్ ఎస్ కె), ఆంజనేయులు, నవీన్, శ్రీనివాస్, పాజిటివ్ నెట్వర్క్ ప్రతినిధి రామాంజనేయులు, అశోక్, వీ.హెచ్.ఎస్ సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా డీ ఆర్ పి రమేష్ పాల్గొన్నారు.

# ప్రశాంతి నిలయంలో అలరించిన నాటక ప్రదర్శన




రామాయణ ఘట్టంలోని ఒక సన్నివేశం

**పుట్టపర్తి రూరల్ డిసెంబర్ 01 ప్రభాతవార్త**

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో హైదరాబాద్ భక్తుల పర్తియాత్రలో భాగంగా ఆదివారం ఉదయం ప్రముఖ కర్ణాటక గాయకురాలు సౌమ్య వారణాసి అద్భుతమైన సంగీత గానకచేరిని నిర్వహించారు. ఈ సంగీత కచేరి అద్భుతమైన అమ్మ వారి కీర్తన తో ప్రారంభించబడింది. సౌమ్య ప్రముఖ గాయకులైన మల్లాది బ్రదర్స్ దగ్గర శిక్షణ పొంది, 1999 నుండి ప్రపంచవ్యాప్తంగా వేయక పైగా కచేరీలు నిర్వహించింది. ఈమె నిర్వహించిన సంగీత కచేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకొనింది. సాయంత్రం హైదరాబాద్కు చెందిన బాలవికాస్ విద్యార్థులు నిర్వహించిన బలవంతుడు హనుమంతుడు అనే నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో రామాయణంలోని హనుమంతుని ప్రాసిస్యాన్ని తెలిపే విధంగా నిర్వహించారు. పర్తియాత్ర ప్రాముఖ్యతను తెలిపే విధంగా నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం ట్రస్ట్ వర్గాలు విద్యార్థులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు విద్యార్థులు సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అనంతపురం కలెక్టరేట్, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలను సంబంధిత అర్జీలను అందచేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా పంపిణీ

**అనంతపురం కలెక్టరేట్, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన చెరుకూరి తిరుపతినాయుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా ఆయన భార్య చెరుకూరి శాంతమ్మకు ఆదివారం అనంతపురం నగరంలోని పార్లమెంట్ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎంపి అంబికా లక్ష్మినారాయణ చేతుల మీదుగా 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, ఎస్ఇ సంపత్‌కుమార్, డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఏఇ చంద్రశేఖర్, కోమటికుంట్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చెక్ అందచేస్తున్న ఎంపి, ట్రాన్స్‌కో అధికారులు →



# తల్లిపై కక్ష పెంచుకుని, కొడుకును చంపేశాడు

- విద్యార్థి హత్య కేసులో నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

**సత్యసాయి జిల్లా వైద్యము డిసెంబర్ 1 ప్రభాతవార్త**

సకాలంలో తమకు ఫిర్యాదు అంది ఉంటే బాలుడిని కాపాడే అవకాశం ఉండేదని, ఈ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ బాలుడి హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర మండలం ఆమదాల గొంది జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి హత్య కేసులో 24 గంటలు కూడా గడవకముందే నిందితులను అరెస్టు చేశామన్నారు. మడకశిర మండలం మరువపల్లి గ్రామానికి చెందిన పుష్పవతి కొన్నేళ్ల క్రితం భర్తతో విభేదాలు కారణంగా పుట్టినిల్లు అయిన మరుగుపల్లిలోనే కుమారుని చదివించుకుంటూ ఉంటోందని చెప్పారు. ఈ క్రమంలో ఆమెకు బంధువైన అశోక్ కుమార్ శారీరకంగా ఆమెను లొంగదీసుకుందేందుకు అనేక ప్రయత్నాలు చేశాడని తెలిపారు. విషయాన్ని పుష్పవతి పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామ పెద్దలు అశోక్ కుమార్ ను మందలించారన్నారు. అప్పటి నుంచి ఆయన పుష్పవతిపై కక్షపెంచుకొని కుమారుడిని చంపాలని పథకం రచించినట్లు తెలిపారు. అశోక్ కుమార్ కర్ణాటక రాష్ట్రం పావగడలో వివాహేతర సంబంధం కలిగి ఉన్న నాగలక్ష్మి అనే మహిళతో కలిసి బాలుడి హత్యకు కుట్ర పన్నినట్లు తెలిపారు. నవంబర్ 28న ఆముదాల గొంది పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఆట బొమ్మలు కొనిస్తానని నమ్మించి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లి గొంతు కోసి హత్య చేసి ముళ్ళపొదల్లో పడేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో బాలుడి తాతకు ఓ వ్యక్తి నుంచి ఫోన్ కాల్ రావడం, పాఠశాలలో పిల్లాడు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఫిర్యాదు అందే సమయానికే ఆలస్యం జరగడం వల్ల బాలుడిని కాపాడలేకపోయామని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు, బాలికలు, మహిళలకు సంబంధించి సకాలంలో పోలీసులకు ఫిర్యాదులు అందితే క్షేమంగా వారిని కాపాడగలుగుతామన్నారు. పరిగి మండలంలో ఓ బాలిక అదృశ్యమైనట్లు సకాలంలో ఫిర్యాదు రావడంతో గంటల వ్యవధిలోని ఆమెను క్షేమంగా కాపాడగలిగినట్లు ఎస్పీ తెలియజేశారు.




విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

## శ్రీ బాలాజీ కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

**హిందూపురం టౌన్ డిసెంబర్ 1 ప్రభాతవార్త**

ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమం స్థానిక బాలాజీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించవచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ నిర్మూలనకు ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఓ లు ప్రియాంక, సుప్రియ, శ్వేత, రాజు, హాస్టల్ ఇన్చార్జ్ శివ ప్రసాద్ రెడ్డి, పుష్పలత, విద్యార్థులు అనూరాధ నిషిత, రీనా ప్రియ, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ప్రారంభమైన నిత్య అన్నదానం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప, భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్పలు

**హిందూపురం డిసెంబర్ 1 ప్రభాతవార్త**

హిందూపురం ప్రాంతంలో మొట్టమొదటి అయ్యప్ప దేవాలయంగా గుర్తింపు పొందిన మండలంలోని కిరికెర శ్రీ మణికంఠ దేవాలయంలో ఆది వారం నుంచి మాలాధారణ చేసిన అయ్యప్ప భక్తులకు నిత్య అన్నదానం ప్రారంభమైంది. తొలిరోజు దాత నక్కలపల్లి శ్రీరాంరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు సడియప్పన్ స్వామి, వై.ఎన్. మూర్తి తదితరులు మాట్లాడుతూ జనవరి 5వ తేదీ వరకు ప్రతిరోజు అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం భోజనం, రాత్రి ఫలహారం సంతర్పణ చేయడం జరుగుతుందని వివరించారు. భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

## జగదీశ్వర్‌కు సొంతమైన గురుబ్రహ్మా అవార్డు



అవార్డు అందుకున్న టీచర్ జగదీశ్వర్

**గోరంట్ల, డిసెంబర్ 1 పభాతవార్త**

పుట్టపర్తి మండలం ప్రశాంతి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న గోరంట్లకు చెందిన దేవాంగం జగదీశ్వర్ సామాజిక సేవలను గుర్తించి గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డును విశాఖపట్టణంలోని మదర్‌థెరిసా సంస్థ వారు అందచేశారు. కరోనా సమయంలో నిరాశ్రయులకు ఆహారం, నిత్యావసరాలు, తోపుడుబండ్లు అందచేయడం జరిగింది. 2007లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2018లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2023 డిసెంబర్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఆల్ ద బెస్ట్ అకాడమీ వారిచే అందుకోవడం జరిగింది. 2024లో గురుబ్రహ్మ అవార్డును అందుకోవడం ఉపాధ్యాయునిగా నా బాధ్యతను మరింత పెంచిందని జగదీశ్వర్ సంతోషం వ్యక్తం చేశారు.

## కౌన్సిలింగ్ మీటింగ్‌లో ఉపాధ్యాయ సమస్యలపై చర్చ



సమస్యలపై వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గోరంట్ల, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

అనంతపురంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డికి ఉపాధ్యాయ సమస్యలపై జిల్లా నాయకులు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. 30 శాతం ఐఆర్ (మధ్యంతర భృతి) చెల్లించాలని, పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, సెలవులు పాత నిబంధనలకు అనుగుణంగా వుండేలా చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని కోరడమైంది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేంద్రరెడ్డి, బయారెడ్డి, రామాంజినేయులు, సుధాకర్‌రెడ్డి, పిఆర్‌టియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన లక్కరాజు



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

**లేపాక్షి, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, ఇండియన్ యువజన కాంగ్రెస్ ఏపి ఇన్‌చార్జ్ మమతానాగిరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వంశీకృష్ణలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శాసనాలు, చవితి వినాయకుడు, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అసంపూర్తి కళ్యాణమండపం, లతా మండపం, నాట్యమండపంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాలు, వేలాడే స్తంభం చరిత్రను తెలుసుకున్నారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లేపాక్షి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పఠాన్‌సద్రుద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నంది విగ్రహాన్ని వారు సందర్శించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారి వెంట లేపాక్షి మండల కాంగ్రెస్ పార్టీ నాయకు హనుమంతరాయుడు, బాబు, బాబా, తదితరులు వున్నారు.

## చెరువు, చింత ఫలసాయం వేలం

**అగళి, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

అగళి చెరువులో చేపల పెంపకానికి, చెరువులో ఉన్న చేపలకు శుక్రవారం రోజు 6వ తేది సచివాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే పాటదారులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. చింత ఫలసాయం వేలం పాటలో పాల్గొనే వారు 3వేలు దరావత్తు చెల్లించాలన్నారు. ఇరిగేపల్లి చింత ఫలసాయాన్ని 5వ తేది గురువారం వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆర్‌జె హళ్లి చింత ఫలసాయాన్ని 4వ తేది బుధవారం సచివాలయం వద్ద వేలం వేయనున్నట్లు తెలిపారు. ఇనగలూరు చింత ఫలసాయాన్ని 3వ తేది సచివాలయం వద్ద వేయనున్నట్లు తెలిపారు. వేలం పాట అయిన తర్వాత డబ్బులను 50 శాతం అప్పటికప్పుడే చెల్లించాలన్నారు.

## సభ్యత్వ నమోదు బాగా చేసిన వారిని అభినందించిన ఎమ్మెల్యే



మహేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

**అగళి, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న కార్యకర్తలను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి అభినందించారు. సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీం సభ్యులను అభినందించారు. ఇరిగేపల్లి పంచాయితీ పరిధిలో 1446ఓట్లకు గాను ఇప్పటి వరకు 980 మందికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 74 శాతం సభ్యత్వం నమోదు చేసినందుకు వారిని అభినందించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు బూత్ ఇన్‌చార్జ్‌లు ఎంఎంపాళ్యం మహేష్, మంజు, మూర్తి, మేస్త్రు, లింగరాజు, శివకుమార్, కుమార్, తేజ, మంజు, బోదమ్మ, రఘు, యోగి, రామన్న, హరీష్, దేవరాజ్‌తోపాటు ఎంఎం పాళ్యం పరిధిలో ఆరోగ్యం బాగోలేకున్న 765 మెంబర్‌షిప్ చేసినందుకు మహేష్‌ను అభినందించారు.

## బియ్యం తప్పా ఏమి ఇవ్వరా..ఇదేమి స్టోరు

**-రేషన్‌కార్డుదారుల పక్షాన కమ్యూనిస్టుల ఆందోళన**

**గోరంట్ల, డిసెంబర్ 1 ప్రభాతవార్త**



స్టోర్ డీలర్‌తో వాగ్వివాదం చేస్తున్న దృశ్యం

పట్టణంలోని మసీద్ సర్కిల్‌లోని ప్రభుత్వ చౌకదుకాణం డీలర్ రేషన్‌కార్డుదారులకు బియ్యం మాత్రమే ఇచ్చి చక్కెర, బ్యాళ్లు, జొన్నలు, సబ్బులు ఇవ్వడం లేదని కమ్యూనిస్టు పార్టీ నాయకులు చౌకధాన్యపు డిపో వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్డుదారులు వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల దృష్టికి తీసుకరావడంతో సంఘం నాయకులు స్వర్ణలత, కొండా వెంకటేశులు ఆదివారం ఉదయం ప్రభుత్వ చౌకదుకాణం వద్దకు చేరుకుని డీలర్ రమేష్‌తో చర్చించారు. సబ్బులు, బ్యాళ్లు, జొన్నలు, చక్కెర ఎందుకు ఇవ్వడంలేదని ఇవ్వకూడదని ఎవరు చెప్పారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇవ్వాలని కార్డుదారులకు మోసం చేయడం మంచిది కాదని గిట్టుబాటు కాకపోతే తప్పుకోవాలే తప్పా కార్డుదారులకు అన్యాయం చేయ కూడదన్నారు. అక్కడే వున్న రేషన్‌కార్డుదారులు కూడా డీలర్‌ను ప్రశ్నించారు. అన్ని రకాల సరుకులు కార్డుదారులకు ఇవ్వకపోతే సోమవారం తహశీల్దార్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. ఈ విషయమై స్టాకిస్ట్ మనోహర్‌కు ఫోన్ చేసి విషయం అడుగగా అధికారి కూడా అన్ని రకాల వస్తువులు ఇవ్వాలని లేదంటే నిలిపివేయాలని హెచ్చరించారు. డీలర్ గత్యంతరం లేక కార్డుదారులకు అన్ని రకాల సరుకులు వేస్తామని నాయకులు, కార్డుదారులకు చెప్పడం జరిగింది.

## అయ్యప్ప ఆలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తా

**- లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్**



భోజనం వడ్డిస్తున్న కరణం రామానందన్

**లేపాక్షి, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని లేపాక్షిలో వెలసిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్ అయ్యప్పలకు హామీ ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన లేపాక్షి అయ్యప్ప సన్నిధానంలో జరిగిన అన్నదాన కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి పట్ల తనకు భక్తి విశ్వాసాలు మెండుగా వున్నాయన్నారు. లేపాక్షిలో ఆలయ అభివృద్ధికి అన్నదాన కార్యక్రమానికి తనవంతు ఆర్థిక సహకారం అందచేస్తామన్నారు. అదేవిధంగా హిందువులు ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అయ్యప్పస్వామి మండల పూజ తరువాత కూడా అయ్యప్పల దేవాలయాల్లో హిందుత్వ బోధనకు సహకరించే భజనలు అనునిత్యం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి అన్నదాన కమిటీ సభ్యులు రాంప్రసాద్, మండల ఉపాధ్యక్షులు అంజనరెడ్డి, వేచ్చం రవి, ఈడిగ రమేష్‌లతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 200 మందికి వైద్య పరీక్షలు

**అమరాపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త**



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠ శాల ఆవరణలో అమరాపురం వైద్య ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ జ్యోతి విజయ్‌కుమారి, డాక్టర్ ఓంకార్‌నాయక్‌లు హాజరైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఇందులో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమరాపురం మైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజ్, మెడికల్‌స్టోర్ అజయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## స్మశాన వాటిక దారి పునరుద్దరణ

**రామగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

మండలంలోని శేషంపల్లి గ్రామంలో స్మశాన వాటిక దారిని పునరుద్దరించారు. ఆదివారం టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాలతో అధికారులతో మాట్లాడి ఆదారి పునరుద్దరణకు చర్యలు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్మశాన వాటికకు దారే లేకుండా మూసివేయించారు. టిడిపి ప్రభుత్వం రాగానే గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులందరూ కలిసి పునరుద్దరణ పనుల్లో పాల్గొని పనులను పూరితచేయించారు. దీంతో ఎమ్మెల్యే పరిటాల సునీత గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



స్మశాన వాటికకు దారిని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## ప్రశాంతి నిలయంలో సత్యసాయి నేత్రమిత్ర మొబైల్ క్లినిక్ ప్రారంభం



నేత్రమిత్ర మొబైల్ యూనిట్ ను ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

**పుట్టపర్తి రూరల్ డిసెంబర్ 01 ప్రభాతవార్త**

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని నాయకులను సభ మండపంలో నేత్ర మిత్ర మొబైల్ ఐ క్లినిక్ ను ప్రారంభించడం జరిగింది. ఈ మొబైల్ యూనిట్ని సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ మొబైల్ నెట్ ద్వారా పంజాబ్ మరియు హర్యానాలోని మారుమూల గ్రామాల ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ మొబైల్ యూనిట్లో ఫండస్ కెమెరా, ఆటో రిఫ్రాక్టర్,స్లిట్ ల్యాంప్, లెన్సో మీటర్ మరియు ముఖ్యమైన లేబరేటరీ పరికరాలు సహా ఆధునిక నేత్ర రోగ నిర్ధారణ సాధనాలతో కూడిన ఈ అధునాతనమైన మొబైల్ ఐ క్లినిక్ వాహనం ద్వారా సేవలను అందించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో సేవా సంస్థల ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## శిశు గృహం చేరిన పసికందు

**పుట్టపర్తి రూరల్ డిసెంబర్ 01 ప్రభాతవార్త**



శిశు గృహంలో శిశువును అప్పగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి మండల పరిధిలోని చాలుకూరు శివాలయం వద్ద అర్ధరాత్రి లభించిన పశికందు ను ఐసిడిఎస్ సిబ్బంది చేరదీసి ఆ రాత్రి అక్కడే ఉంచుకొని ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలోని శిశు గృహానికి, సోమందేపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ అనురాధ, సూపర్వైజర్ రజిత ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో శిశు గృహానికి చిన్నారిని తీసుకువచ్చి అప్పగించారు ఇప్పటికే శిశు గృహంలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ బాలునితో ఆ సంఖ్య మూడుకు చేరింది చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది లక్ష్మీ ప్రసన్న, ఆధ్వర్యంలో శిశు గృహ నిర్వాహకులకు బాలుని అంద జేశారు. ఇదివరకే శిశు గృహంలో ఉన్న చిన్నారులను దత్తకు తీసుకోవడానికి ఎంతో మంది ముందుకు వస్తున్నారని నిబంధనల మేరకు వారిని దత్తకు ఇచ్చే తంతు కొనసాగుతోందని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చెన్నకృష్ణారెడ్డికి సన్మానం



చెన్నకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ సంఘ నాయకులు

**కొత్తచెరువు డిసెంబర్ 1 ప్రభాతవార్త**

ఏపీటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కన్సిలర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తరుగు చెన్న కృష్ణారెడ్డి ని ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఆదివారం కొత్తచెరువు బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ సంఘ సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు ఆయన మొట్టమొదటి ఉద్యోగ ప్రయాణం కొత్త చెరువు లోనే ప్రారంభించి అదేవిధంగా తన పదవి విరమణ కూడా ఇదే మండలంలో చేశారు తాను పని చేసిన పాఠశాలలో ఉపాధ్యాయు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు ఉండడం తోనే నాకు ఈ అవార్డు రావడానికి దోహ దమన్నారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు ఆర్ చంద్ర జిల్లా గౌరవ అధ్యక్షులు పి వి మాధవ హరి ప్రసాద్ సాయి శివ, చంద్ర, రవీంద్రారెడ్డి వెంకట్ నారాయణ జయరాం పాల్గొన్నారు

## దళిత కాలనీ సమస్య పై ధర్నా



దళితవాదుల ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

**పుట్టపర్తి రూరల్ డిసెంబర్ 01 ప్రభాతవార్త**

పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్లకుంట క్రాస్ దళితవాడలో సమస్యలపై కొత్తచెరువు ఎంపీడీవో కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం. ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న కోశాధికారి,వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా మామిళ్ళకుంట క్రాస్ దళితవాడలో ఆదివారం వారు పర్యటించారు. కాలనీలో మురుగునీరు ,తొలగించి తక్షణం వీధిలైట్లు వేయాలని కాలువలు ఏర్పాటు చేయాలని గత నెల 23 న పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కాలనీవాసులతో కలిసి ఎంపీడీవో నటరాజ్ కి అందజేశామని. స్పందించిన ఎంపీడీవో తక్షణ వీధిలైట్లు ఏర్పాటు చేసి కాలువల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ నెల రోజులవుతున్న పరిష్కారం చేయలేదనీ. ఇదే విషయాన్ని సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేశు కాలనీవాసులతో కలిసి ఎంపీడీవో తో శనివారం వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరగా నీకు దిక్కున చోట చెప్పుకోమని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అందుచేత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. కాలనీవాసులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రమాదేవి , లక్ష్మమక్క , వెంకటేశులు , నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**చెన్నేకొత్తపల్లి, డిశంబర్, 01, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన చెన్నె కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో, ఆదివారం,రౌడీ షీటర్లకు, రామగిరి, సర్కిల్ ఇన్స్పెక్టర్, శ్రీధర్, కౌన్సిలింగ్ ఇచ్చారు, ఈ సందర్భంగా, పోలీస్, రికార్డుల్లో రౌడీషీటర్లుగా నమోదైన వారిని పోలీస్ స్టేషన్ పిలిపించి, ఎటువంటి, అల్లర్లు సృష్టించకుండా, సత్ప్రవర్తనతో వెలగాలని, సీఐ,వారికి, సూచించారు, , గ్రామాల్లో క్రిమినల్, లాంటి, చర్యలలో పాల్గొంటే, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ఘనంగా కవిత సమ్మేళన ఉత్సవ వేడుకలు




కవిత సమ్మేళన ఉత్సవ వేడుకలు

**ధర్మవరం రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త**

పట్టణంలోని బత్తలపల్లి రోడ్డు పోలా ఫంక్షన్ హాల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కవితా సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కవులు, కళాకారులు హాజరయ్యారు. తదుపరి నాగులాదేవి అనేటువంటి శ్రీకృష్ణదేవరాయల యొక్క ప్రేమ కథ చారిత్రక నవలను అందరూ ఆవిష్కరించారు. రాయలు మహిళల పట్ల చూపిన ఆదరణ ప్రజల పట్ల చూపిన సేవాభావము సాహిత్యం చేసిన కృషిని వారు కొనియాడారు. అనంతరం ఆంధ్రప్రభ ఎడిటర్ శర్మ మాట్లాడుతూ.. ఇంత పెద్ద ఎత్తున ధర్మవరంలో కవిత్వం విజయవంతం కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ధర్మవం నియోజకవర్గం అధ్యక్షులు జయసింహా కార్యదర్శి సత్య నిర్దారణ వారి నేతలు వారి యొక్క అధ్యక్షతన రెండు సభలు జరిగి వంద మంది కవులు కవిత గానాన్ని వినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కవిత్వం అనేటువంటిది సామాజిక జాగ్రత్త, సామాజిక చైతన్యం చేయడంలో ఒక మంచి సాధనము అని తెలిపారు. మెరుగైన సమాజం కోసం పాటుపడే సాహిత్యం ఆ సాహిత్యంలోని ముఖ్యమైనటువంటిది కవిత్వం అని తెలిపారు. అనంతరం పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. కవులందరినీ ఘనంగా సత్కరించారు. తదుపరి బాలాజీ లలితా కళారూత్యము యొక్క ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. చేనేత, వృద్దుల అంశంపై, కవిత గోష్టి నిర్వహణ అందరిని ఆకట్టుకుంది. రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్, యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర మాట్లాడుతూ.. భారతదేశంలో ఇటువంటి వైవిద్య కార్యక్రమాన్ని ముందుకొచ్చిన జిల్లా రచయితల సంఘం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు రచయితలు జయసింహా, డాక్టర్ సత్య నిర్దారణ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ రద్దు పట్ల మైనార్టీలు హర్షం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తంచేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

**కొత్తచెరువు, డిసెంబర్ 1, ప్రభాతవార్త**

గత వైసిపి ప్రభుత్వంలో నియమించిన మైనార్టీ సంక్షేమ శాఖ వక్ప బోర్డ్ రద్దు చేసి, జీవో నెంబర్ 47 ఉపసంహరణ చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం త్వరలోనే నూతన వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్పందిస్తూ ఆదివారం కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తచెరువులో మైనార్టీ సోదరులు ర్యాలీ నిర్వహించిన అనంతరం దివంగత ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. జీవో నెంబర్ 47 ను రద్దు చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి ,పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి కి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

**పుట్టపర్తి టౌన్ డిసెంబర్ 1 ప్రభాతవార్త**

అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6 నుండి తొమ్మిదవ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపధ్యక్షుడు సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి పట్టణంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం రాష్ట్ర మహాసభలకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాల నిరుద్యోగులకు ఏ ప్రభుత్వం వచ్చినా తీవ్ర అన్యాయం జరుగుతోందని, నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాలు వలసలు పోయి చాలీచాలని జీతాలతో ఒక పూట తింటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మాసంలో జరగబోవు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు హరి, ఏఐవైఎఫ్ నాయకులు దేవేంద్ర, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గొడవలకు దూరంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ధర్మవరం రూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలని ధర్మవరం గ్రామీణ పోలీసులు రాంపురం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ఏర్పాటు చేసిన రాంపురం గ్రామ సభలో గ్రామీణ ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గొడవలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్యలు ఉంటే ఆ సమాచారాన్ని మా దృష్టికి తీసుకురావాలని పేకాటకు దూరంగా ఉండాలని, మద్యానికి భానిస కాకూడదని అంతేకాకుండా సైబర్ క్రైమ్‌పైన అవగాహన పెంచుకోవాలని ప్రజలకు సూచించడం జరిగిందన్ని గ్రామీణ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీలస్‌సిబ్బందితోపాటు గ్రామీణ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను నెలలోపు ఇవ్వాలి

## - ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసేందుకు యావత్ మాదిగ జాతి తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన ఎమ్మార్పిఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశానికి ఎమ్మార్పిఎస్ అనంతపురం జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ అధ్యక్షతగా వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మఉన్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ కార్యక్రమ పరిశీలకులుగా ఎంఎస్‌పి జాతీయ నేత సొట్ట నరేంద్రబాబు మాదిగ, ఎమ్మార్పిఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి దుడ్డు రామకృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గారి నాయకత్వ ంలోని ఎమ్మార్పిఎస్ ప్రతినిధి బృందానికి ఇచ్చిన హామీ మేరకు డిఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేయడం, ఇతర ఉద్యోగ నియామకాలను వాయిదా వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐతే ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ తన నివేదికను నెలలోపే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, ఎమ్మార్పిఎస్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పలక ఆంజినేయులు, ఎంఎస్‌పి సీనియర్ నేత కెబి మధు, ఎంఇఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు సాకే అమర్‌నాథ్, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.హను మం తరావు, ఎమ్మార్పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్, జిల్లా ప్రదాన కార్యదర్శి రేకులకుంట రామాంజినేయులు, ఎంఎస్‌పి నేతలు రాప్తాడు నాగభూషణం, మాదిగ మహిళ సమాఖ్య నేతలు జగ్గుల స్వతంత్ర కుమారి, కొమ్మూరి సునీత, మాదిగ యువసేన బాణాసి శీనా, ఎంఇఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, ఎంఇఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గూనిప ఒడ్ల నాగేంద్రనాథ్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మంజు, ఎంఆర్‌పిఎస్ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు పికె గంగరాజు, ఎంఎస్‌పి సీనియర్ నేతలు పెద్ద రాజు, ఆదినారాయణ, దబ్బల శ్రీరాములు, గుంతకల్ నరసింహులు, శింగనమల ఓబులేసు, కళ్యాణదుర్గం మారెన్న, యాడికి పుల్లయ్య, నరస నాయి నికుంట సూరి, జేసి శేఖర్, సిఎం నరసింహులు, కళామండలి నరసింహులు, కసాపురం వెంకటేషు, కళ్యాణదుర్గం తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ

# ఛలో విజయవాడను విజయవంతం చేయండి

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

సిపిఎస్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్దరించాలని కోరుతూ ఈ నెల పదిన విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపిసిపిఎస్‌ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, రామన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబందించిన గోడపత్రికలను ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అసోషియేషన్ ప్రెసిడెంట్ ప్రేమనాథరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పినా మాట నిలుపుకోలేకపోయారని, పైగా నిరసన కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపి ఉద్యోగుల గొంతునొక్కి, ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సిపిఎస్ విధానంపై ఒక సంవత్సరంలో మంచి పరిష్కారం చూపుతానని మేనిఫెస్టోలో తెలిపారని, సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న అక్రమ కేసులన్ని ఎత్తవేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని ఇదే విషయం నారాలోకేష్ కూడా చెప్పునట్టు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఈ విషయాలలో సాధ్యమైనంత త్వరగా ముందుకు వెళతారని ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులతో చర్చల ద్వార సమస్య పరిష్కారానికి వేగంగా చొరవ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగు లు ఏ పార్టీకి వత్తాసు పలకరని సిపియస్ ఉద్యోగులకు మంచి చేసవారికే మద్దతు ఇస్తారని తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో భారతీయ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించినా పాలకులు ఉద్యోగుల విషయంలో సమానత్వం పాటించడం లేదని చేస్తున్న పనపి ఒకటే అయినా రెండురకాల పెన్షన్ విధానాలతో 2004 తరువాత ఉద్యోగంలో జాయిన్ అయిన వారికి సిపియస్ విధానం అమలు చేస్తూ రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు దెబ్బతీసారని ఇకనైనా పాలకులు తగిన నిర్ణయాలతో సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరు ద్దరించి రాజ్యాంగం హక్కును అమలు పరచాలని ప్రభుత్వాని కోరారు. ఒక్క టే పని ఒక్కటే పెన్షన్ విధానం అమలు చేయాలని వాడు డిమాండ్ చేశ్వారు. అలాగే సిపియస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాడ్యటీ సదుపాయాలను కల్పించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ మంచి నిర్ణయ ంతో సిపియస్ విధానం రద్దుపై ముందడుగు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపియస్ విధానంలో ప్రాన్‌ఖాతాకు ప్రతినెల జమ కావాల్సిన సొమ్ములు సరిగా జమాకావడం లేదని దాదాపు సంవత్సర కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే జమచేసి ఇకపై ప్రతినెలా ఠంచనుగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తి వేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సిపిఎస్ఈఎ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎన్జీఓ అధ్యక్షుడు మనోహర్, నగర బాడీ అధ్యక్షులు భాగ్యరాజ్, శివశంకర్‌రెడ్డి, రామాంజి నేయులు, గోపాల్‌రెడ్డి, రంగనాథ్, బాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు టిడిపి సభ్యత్వం శ్రీరామరక్ష

## -టిడిపి తెలుగు యువత అధ్యక్షుడురెడ్డి వాండ్ల రాజశేఖర్‌రెడ్డి

## -బొమ్మేపర్తి గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదుకు నగదు అందజేత

రాప్తాడు, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు టీడీపిర ఆప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళీ దిశా నిర్దేశానుసారం.. ఆదివారం మండల పరిధిలోని బొమ్మేపర్తి గ్రామంలో రోజువారీ కూలి పనిప చేసుకునే నిరుపేద టిడిపి కార్యకర్తల సభ్యత్వ నమోదుకు తెలుగు యువత మండల అధ్యక్షులు రెడ్డి వాండ్ల రాజశేఖర్‌రెడ్డి 30 వేలు రాప్తాడు మండల టిడిపి ఇన్‌చార్జ్ ధర్మవరం మురళీకి అందచేయడం జరిగింది. తమ మాట మీద గౌరవంతో టిడిపి సభ్యత్వ నమోదు కోసం ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొచ్చిన నాయకులను, కార్యకర్తలను ధర్మవరపు మురళీ అభినందించారు. టిడిపి సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ టిడిపి పార్టీ అలాగే పరిటాల కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని మండల ఇన్‌చార్జ్ మురళీ అన్నారు. ఈ సందర్బంగా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డివాండ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలకు టిడిపి సభ్యత్వం శ్రీరామరక్ష అని అన్నా రు. 100 రూపాయలు చెల్లించి టిడిపి పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగి కార్యకర్త మృతిచెందితే ఐదు లక్షలు ప్రమా ద భీమా ఆ కుటుంబానికి చెల్లించి టిడిపి పార్టీ అండగా ఉంటుందున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, జూటూరు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేయించిన దృశ్యం

# ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి : పిఆర్‌టియు ఏపి నేతలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు ఎపి ప్రధాన కార్యదర్శి ఏఎం.గిరి ప్రసాద్ కోరారు. డిసెంబర్ 1 అనంతపురం పట్టణం గుత్తి రోడ్డు లోగల లక్ష్మి సెనర్జీ ప్రాంగణంలో జరిగిన పిఆర్‌టియు ఏపి ఉమ్మడి అనంతపురం జిల్లాకౌన్సిల్ సమావేశాలకు పిఆర్‌టియు ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం.గిరి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిఎఫ్, ఎపి జిఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పిఆర్‌టియు ఎపి అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు టి.పురుషోత్తమరెడ్డి, జి.తిమ్మారెడ్డి పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని 30 శాతం అయ్యారని ప్రకటింపజేయాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్ రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్సిల్ ఆప్షన్ మాత్రమే అని ఇబబ ంది ఉ న్నవారు తరగతి తర్వాత ఇంటికి వెళ్లడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. పని గంటలు ఉదయం తొమ్మిది నుంచి నాలుగు వరకు ఉండే పాత విధానాన్నికొనసాగించాలని డిమాండ్ చేశారు. పలు ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలను పై సుదీర్ఘంగా చర్చించారు. పలు తీర్మాణాలు ఆమోదించారు. తర్వాత రెండు జిల్లాలకు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిలుగా టి.చం ద్రశేఖ ర్‌రెడ్డి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా టి.పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిమ్మారెడ్డిని, నగర అధ్యక్షురాలుగా ఉమాదేవిని, యు.రఘు రామయ్యను జిల్లా ఉపాధ్యక్షునిగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకోవ డం జరిగింది. నూ తన అధ్యక్ష ప్రధాన కార్య దర్శిలు ఉపాధ్యాయుల సమస్య లు సాధజంచడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా మని తెలిపారు. ఎన్నికల పరిశీలన శిష్ణువర్ధన్‌రెడ్డి, ఈ శ్రీరా ములు వ్యవ హరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందరూ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.


నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు

# వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షునిగా కుంచెపు వెంకటేషులు ఎన్నిక

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

వడ్డెర్లకు నామినేటెడ్ పదవులు కేటాయించి, వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల మురళీ పేర్కొన్నారు. ఆదివారం నగరంఒలని 5వ రోడ్డులో సాయిబాబా గుడి ఫంక్షన్ హాల్‌లో వడ్డెర్లసంఘం నూతన కార్యవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల నూతన అధ్యక్షునిగా కుంచెపు వడ్డే వెంకటేషులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

అలాగే కార్యవర్గంలో జిల్లా ప్రధాన కార్యద ర్శి పరిగి హనుమన్న, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్.నాగరాజు, పెనుకొండ శ్రీనివాసులు, జిల్లా కోశాధికారిగా పెద్ద మారెప్ప,జిల్లా కార్యదర్శిగా వెంకట పతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీట్ల సుధాకర్, జిల్లా సెక్రెటరీగా ఆలకుంట నారాయణస్వామి, మొదలగు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా వడ్డెర సంఘంలో ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా, ఉపాధ్యక్షుడుగా, వడ్డెర్ల కోసం పని చేసిన కుంచపు వడ్డే వెంకటేషులను ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడుగా నియమిం చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం కార్యదర్శి వడ్డే ఆంజినేయులు, గుంతకల్లు రామాంజినేయులు, మునిస్వామి, యాలేరు నాగేంద్ర, యాడికి శేఖర్, చెదలరాజు, మల్లెల పెద్దన్న, పీట్ల రవీంద్ర, నా ర్వల లక్ష్మిదేవి, ముత్యా లమ్మ, గోరం ట్ల రామాంజి నేయులు, వడ్డే మంజునాథ్, వడ్డెర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షునిగా కుంచెపు వెంకటేషులుని సన్మానిస్తున్న దృశ్యం

# రాప్తాడు నియోజకవర్గంలో 51వేలు దాటిన టిడిపి సభ్యత్వ నమోదు

అనంతపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త బ్యూరో

రాప్తాడు నియోకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు 51 వేలు దాటిందని, ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలం నసన కోట పంచాయితీ ముత్యాలంపల్లి గ్రామంలో జరిగిన టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్వయంగా గ్రామస్తుల చేత సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. గత ఏడాది 36వేలకుపైగా సభ్యత్వం నమోదు ఉండేదని, ఇప్పుడు 51వేలు దాటిం దన్నా రు. డిసెంబర్ 1వ తేది సాయంత్రానికి 51వేలు, 2వందల మంది సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. సభ్యత్వ నమోదుకు కృషి చేసిన అందరికీ సునీత అభినందనలు తెలిపారు. సభ్యత్వ నమోదు గురించి ఇంకా కొంత మంది ప్రజలకు అవగాహన లేదన్నారు. వారికి దీని ప్రయోజనాలను చెప్పి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. సభ్యత్వ నమోదులో మనం టాప్-5లో ఉండేలా చూడాలని సునీత పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.


సభ్యత్వ నమోదును చూపుతున్న టిడిపి నేతలు

# హెచ్ ఎల్సీ కెనాల్లో బాలుడు గల్లంతు

బుక్కరాయసముద్రం డిశంబర్ 1 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని ఐలమ్మ కాలని కి చెందిన మోహన్‌సాయి ప్రమాదశాత్తువతో హెచ్ ఎల్సీ కెనాల్లో గల్లంతు అయ్యాడు. స్థానికులు బందువులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మ నోహర్ పద్మావతి పా డిప శువులతో జీవనం గడుపుచున్నారు,వీరికి ముగ్గురు సంతా నం ఇద్దరు మగ పిల్లలు ఒక ఆడపిల్ల పెద్దకు మా రుడు మోహన్‌సా యి(10) 5వ తరగతి చదువు చున్నాడు, ఆదివా రం సెలవు దినం కావడం తో తోటి విద్యార్థులతో కలసి ఆడుకో వడానికి బయటకు వెళ్ళా డు, మధ్యాహ్నం ప్రమా దశాత్తు వతో కెనాల్లో కాలు జారి పడిపో యా డు తోటి విద్యార్థులు గమ నించేలోపు నీటి ప్రవాహ వేగానికి కొట్టుకపోయాడు బయటకు రాలే దని తోటి విద్యా ర్థులు సమా చారం అందిం చడంతో కాలని వాసులు, గ్రామ సర్పంచు పార్వతి పోలీ సులు సంఘటన స్థలానకి చేరుకొని ఫైర్‌ఇంజన్,గజ ఈతగా ల్లతో గాలిం పుచర్యలు చేపట్టారు. విద్యార్థి ఆచూకి తెలియకపో వడంతో తల్లింద్రులు ఆర్థనా ధా లతో మిన్నంటి పోయాయి. గాలిం పుచర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.


మోహన్‌సాయి ఫైల్‌ఫోటో

# ఆదినారాయణను సన్మానించిన దండు శ్రీనివాసులు

శింగనమల, డిసెంబర్ 1 ప్రభాతవార్త

రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాసినేని గ్రాండ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఆదినారాయణను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి పదవులు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణ డైరెక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ.. అన్ని వేళలా తనకు అండగాఉంటూ కష్టకాలంలో తనను ప్రోత్సహించి వెన్నంటిగానిలిచిన దండు శ్రీనివాసులుకు నా కుటుంబ సభ్యుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళాయప్ప, అనంతపురం పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశు రామ్ ,బెస్త నారాయణస్వామి, దేరంగుల శంకరయ్య, దండు సతీష్, కాయల సురేష్, దండు ప్రకాష్, కల్లుమడి నల్లప్ప, రంగస్వామి, సోమప్ప, పులయ్య, వెంకటప్ప, సురేం ద్ర, మునీ ంద్ర, బాబావలి, కాయల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆదినారాయణను సన్మానిస్తున్న దండు శ్రీనివాసులు

# కరెంట్ షాక్‌తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూవ్యక్తి మృతి

కూడేరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త

కూడేరు మండల పరిధిలోని చోళసముద్రం గ్రామానికి చెందిన కురుబల శివ నెల కిందట ట్రాన్స్ ఫార్మర్ల ఫీజు లేస్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. షాక్ గురైన వెంటనే చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రోజున మృతిచెం దాడు. వివరాల్లోకి వెళితే పోలీసులు అందించిన సమాచారం మేరకు చోళ సముద్రం గ్రామానికిచెందిన నాప నాగరాజు అనే అతని తోటలో ట్రాన్స్ ఫార్మర్‌లో ఫీజులు పోవడంతో కురుబశివతో ఫీజులు వేయించడానికి వెళ్లారు. ఫీజులు వేస్తున్న సమయంలోకరెంట్‌సరఫరా కావడం తో షాక్‌కు గురయ్యా డని తెలిపారు. దాదాపు నెల రోజులపాటు చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందన్నారు. మృతుడికి భార్యతోపాటు ఆరు నెలలు చిన్నారి ఉండటంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు నాప నాగరాజు ఇంటి వద్ద శివంతో నిరసనకు దిగారన్నారు. విషం తెలుసుకున్న పోలీసులు నాపనాగరాజు ఇంటి వద్ద శవంతో నిరసనకు దిగారన్నారు. విషయం తెలు సుకున్న పోలీసులు బాధితులతో చర్చించినా ఫలితం దక్కలేదు. మృతికి కారణమైన నాప నాగరాజురావాలని బాధితులకు న్యాయం జరిగే వరకూ శవాన్ని ఇక్కడి నుంచి తరలించేది లేదని భీష్మించుకూర్చున్నారు. దీంతో పోలీసులు చేసేదేమిలేక శాంతి భద్రతల సమస్య రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.


మృతుని ఫైల్ ఫోటో

# పియం కేంద్రీయ విద్యాలయం గ్రాండ్ పేరెంట్స్ డే 2024

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

పియం.కేంద్రీయ విద్యాలయం ఎస్‌కె యూనివర్సిటీ అనంతపురం లో గ్రాండ్ పేరెంట్స్‌డే-2024ను ఘనంగా నిర్వహించారు. గ్రా ండ్‌పేరెంట్స్ డే (ఒక రోజు పిల్ల లు, స్కూల్ టీచర్స్‌తో గ్రాండ్ పేరెంట్స్ గడపడం) గ్రాండ్ పేరెంట్స్ యొక్క ప్రేమాభి మానాలు,వారి మార్గ దర్శనాన్ని గుర్తు చేస్తూ వారు చేసిన సేవలను గుర్తుగా ఈ రోజు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముక్య అతిథిగా ప్రాథమిక తరగతులలోని విద్యా ర్థుల గ్రాండ్-పేరెంట్స్‌ను ఆహ్వా నించి మరికి వినోద క్రీడలను నిర్వమించి విజేతలకు- బహుమ తులు అందజేశారు. ఈ సందర్భ ంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మార్కా ండేయులు సూరి మ ఆట్లాడుతూ.. అవ్వ తాతలు మన జీవితా ల్ని ఎంతో ప్రభావితం చేస్తారని, వారి యొక్క అనుభవం, విజ్ఞతను విద్యార్థుల వికాసంలో ప్రత్యేక పాత్రపోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సా ంస్కృతిక కార్యక్రమాలు, గ్రాండ్ పేరెంట్స్ ఉపన్యాసాలు ప్రేక్షక్షకు లను విశేషంగా ఆకర్షించాయి.



గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

# భవనాసి ప్రదీప్‌కుమార్‌కు డాక్టరేట్‌ప్రధానం

శింగనమల, డిసెంబర్ 1 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని భవనాసి వెంకట సుబ్బయ్య-భవనాసి జయలక్ష్మి కుమారుడు లెక్చరర్ భవనాసి ప్రదీప్‌కుమార్‌కు యోగి వేమన యూనివర్సిటీ తరుపున డాక్టరేట్ ప్రధానం చేశారు. భవనాసి ప్రదీప్‌కుమార్ ధర్మవరంలోని ప్రబుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లై మ్యాథెమెటిక్స్ విభాగంలో (హీట్ ట్రాన్స్ ఫర్ అనాలసిస్ ఆఫ్ హైబ్రిడ్ నామో ఫ్లూయిడ్స్ విత్ రేడియేషన్ అండ్ ఎంహెచ్‌డి) అను పిసిస్ విజయవంతంగా పూర్తి చేసినందుకు నవంబర్ 30న శనివారం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. భవనాసి ప్రదీప్‌కుమార్ గేట్ 2010 ఎంట్రెన్స్‌లో ఆలిండియా ర్యాంక్ 18 సాధించారు. ఈయనకు భార్య కిరణ్‌కుమారి, కుమారుడు బి.షన్ముఖ కార్తికేయన్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం సహకారంతో విజయ వంతంగా పిహెచ్‌డి పూర్తి చేసిట్లు ఆయన తెలిపారు.


భవనాసి ప్రదీప్‌కుమార్


పిసిస్ అందజేస్తున్న దృశ్యం

# ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

శింగనమల, డిసెంబర్ 1 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్ నుంచి ఆర్టిసి బస్టాండ్ వరకు ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.పుష్పలత మాట్లాడు తూ.. వ్యాధి గ్రస్తులు పరీక్షలు నిర్వహించుకుని ధైర్యంగా ఉండాలని ఏఆర్‌టి మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయని అన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారా సౌకర్యవంతమైన జీవితం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ వెంకటపతి, వహిదాబేగం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

# అనంతపురం జిల్లా ముస్లింల మహాసభ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ముస్లిం సోదరులు, మేధావులు, ధార్మిక పండితులు అన్ని జమాత్‌ల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ జాతీయ సమైక్యత, దేశాభివృద్ధిలో ముస్లిం మైనార్టీల భాగస్వామ్యం అలాగే దేశంలో ముస్లిం మైనార్టీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు అనే అంశంపై ఈ నెల 7న (శనివారం) సాయంత్రం ఐదు గంటల న ఉంచి రాత్రి 9 గంటల వరకు అనంతపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. కావున ముస్లిం మైనార్టీ సోదరులంతా ఈ బహిరంగ సభలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఆలిండియా జమ్మితుల్ ఉల్ మా-ఏ-హింద్ జిల్లా శాఖ ఒక ప్రకటన ద్వారా కోరారు.

# మాట ఇద్దాం ఎయిడ్స్ ను నివారిద్దాం

గార్లదిన్నె డిసెంబర్ 01 ప్రభాతవా ర్తగార్లదిన్నె పిహెచ్ సి నందు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ నివారణ దినోత్సవ వేడుకలు సందర్భంగా పి హెచ్‌సిలో ఓ యువత మేలుకో ఎయిడ్స్ వ్యాధిని నివారిద్దాం అంటూ పిలుపునిచ్చారు..ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ గౌతమి మాట్లాడుతూఎయిడ్స్ అంటువ్యాధి కాదు కొన్ని అజాగ్ర త్తల వల్లే వస్తుంది. ముఖ్యంగా కలుషిత సిరేంజిలు మరియు ఇతర పరికరాల ద్వారా రక్త మార్పిడి జరిగి, అక్రమ సంబంధాలు కలిగి వ్యాధి ఉన్న వారితో సెక్స్ చేయడం ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. .వ్యాధిగ్రస్తులు పరీక్షలు నిర్వహించుకున్న తర్వాత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో ఐసీటీసీ సెంటర్ ద్వారా చికిత్స తీసుకోవాలన్నారు..ధైర్యంగా ఉండాలని స్థానిక ప్రజలకు ఎయిడ్స్ నివారణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుల, సీహెచ్ ఓ లోకనాథ్,ఆరోగ్య విస్తారణా ధికారి నాగేశ్వర య్య, పిహెచ్ ఎన్ అరుణ, సూపర్ వైజర్లు కృష్ణ మోహన్, యంఎల్ హెచ్ పిగాయత్రి , ఏఎన్ఎమ్ లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# కనకదాసు విగ్రహ ప్రతిష్ట కోసం భూమి పూజ



భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ట కోసం భూమి పూజలో ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, డిసెంబర్ 1 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మండలం కదరంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీ భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ట భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి అమావాస్య సాయంత్రం 6 గంటల వరకు ఉండటంతో కళ్యాణ్‌దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అమావాస్య గడియాల అనంతరం గ్రామం చేరుకుని విగ్రహ ప్రతిష్ట భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా భూమి పూజ కోసం విచ్చేసిన కురుబ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు ఘనమైన స్వాగతం చేశారు. ఈ సందర్భంగా కురుబల రాష్ట్ర నాయకుడు బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కురుబల విజ్ఞప్తి మేరకు కదరంపల్లి గ్రామంలో శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన కురువ సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నిబంధనలను తప్పకుండ పాటించాలి

## - శింగనమల ఎస్ఐ శరత్ చంద్ర

శింగనమల, డిసెంబర్ 1 ప్రభాతవార్త

రోడ్డు భద్రత నిబంధనల్లో భాగంగా వాహన చోదకుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలని శింగనమల ఎస్ఐ శరత్ చంద్ర పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గార్లదిన్నె నుంచి శింగనమల క్రాస్ వద్ద ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహన దారు లతో ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్, ఫోర్‌వీలర్ డ్రైవర్లు సీట్ బెల్టు ధరించాలని, ఓవర్‌లోడ్‌తో వెళ్లరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరా దని, ద్విచక్ర వాహనాలలో ఇద్దరికి మించి ప్రయాణించరాదు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, నిబంధనలను అతిక్ర మిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు.


ద్విచక్ర వాహన దారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్ చంద్ర

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## - జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి

కదిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక రోడ్ల భవనాల అతిథి గృహంలో ఉద్యోగుల సంఘం కదిరి శాఖ అధ్యక్షులు ఫకృద్దీన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహ ంచారు. కార్యక్రమానికి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం రామాంజినేయులు హాజరయ్యారు. వివిధ శాఖల ఉద్యోగులు ఉద్యోగుల సంఘం దృష్టికి తీసుకు రావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపినాయక్, రామచం ద్రారెడ్డి, దేవ్లానాయక్, సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, రాయాసం హరి ప్రసాద్, చిన్నయ్య శెట్టి, రాం ప్రసాద్, ప్రసన్నకుమారి, వహిద, జయప్రకాష్, ముసలిరెడ్డిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు

# ఘనంగా కెఎం షఫి జన్మదిన వేడుకలు

అనంతపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త బ్యూరో

ముతవల్లి అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఎం.షకిల్‌షఫి జన్మదిన వేడుకలను అనంతపురంలో ఆదివారం ఘనంగా జరుపు కున్నారు. స్నేహితులు, బంధు వులు, వివిధ పార్టీ నాయ కులు, అభిమా నులు పెద్ద ఎత్తున షకిల్ షఫి ఇంటికి వెళ్లి పుట్టిన రోజు శుభాకా ంక్షలు తెలిపారు.


జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న షకీల్ షఫి

**CHANGE OF NAME**

I, PEERAN MAHABOOB NAYEMULLA (OLD NAME) S/O PEERA MAHABOOB SHAFEEULLA, H.NO-18-6-57, AZAD NAGAR, HINDUPUR, S.S-DT,A.P CHANGING MY NAME FROM PEERAN MAHABOOB NAYEMULLA (OLD NAME) TO **PEERAN MAHABOOB NAYEEMULLA** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **PEERAN MAHABOOB NAYEEMULLA** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I, BANDLAPALLI BABA SAHIB (OLD NAME) S/O BANDIAPALLI HUSSAIN SAHIB, H.NO-26-4-618/5, SADASHIVA NAGAR, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM BANDLAPALLI BABA SAHIB (OLD NAME) TO **BANDIAPALLI BABA SAHIB** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **BANDIAPALLI BABA SAHIB** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I, AFSARI (OLD NAME ) W/O PEERAN MAHABOOB NAYEEMULLA, H.NO-18-6-57, AZAD NAGAR, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM AFSARI (OLD NAME) TO **AFSARI BANU** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **AFSARI BANU** (NEW NAME) FOR ALL PURPOSES

04ATP01_04ATP01.qxd 01-12-2024 PM 11:39 Page 1



# ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

## ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి చిత్తశుద్ధితో పనిచేస్తా - నాలుగున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం.ప్రభుత్వ విప్ కాలవ


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.

రాయదుర్గం, డిసెంబర్ 01 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయ వంతం చేసిన అధికారులకు, తెదేపా నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు, పాత్రికేయులకు, పోలీసులకు ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబునాయుడి రాకతో రాయదుర్గం నియోజకవర్గానికి, అనంతపురం జిల్లాకు అనేక రకాల ప్రయోజ నాలు కలుగనున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా పలు అంశాలపై హామీ ఇచ్చాడన్నారు. అనంతపురం జిల్లాకు అత్యంత అవసరమైన హంద్రీనివా తొలిదశ విస్తరణ కార్యక్రమమని, జీడిపల్లి దాక కాలువను విస్తరించడానికి ముఖ్యమంత్రి ప్రకటన చేయడం జరిగిందన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజ కవర్గాలకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన జీడిపల్లి-భైరవాణితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తరలించే కార్యక్రమ పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారని, 36ఈ ప్యాకేజీ క్రింద ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు 64వేల ఎకరాలకు నీరు ఇచ్చే పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇందులో దాదాపు 24,500 ఎకరాల కొత్త ఆయకట్టు రాయదుర్గం రూరల్, కణేకల్లు, భూపసముద్రం వద్ద వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిటన్నిందితో పాటు తుంగభద్ర ఎగువ కాలువ ఆదునీకరణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయ్యాయని వాటికి మరో రూ.600కోట్లు అవసరమవుతుందని, ఆ నిధులను మంజూరు చేయాలని కోరామని వాటికి కూడా ఆమోద ముద్ర వేశారన్నారు. నేమకల్లు గ్రామాన్ని ఆదర్శ గ్రామంలో తీర్చిదిద్దుతామని, అక్కడ ఇల్లులేని వారందరికి 112 మందికి ఇల్లు ఇస్తానని, నేమకల్లులో బీసీ బాలుర ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేస్తామని, రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలకు అవసరమైన నిధులు ఇస్తామ ని, సోలార్ ఏర్పాటు చేయడానికి నేమకల్లును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద ద్దతామని, ప్రతి కుటుంబానికి పీఎం సూర్యదర్ పథకం క్రింద లబ్ధి చేకూర్చే విధంగా చూడాలని ఆయన ఆదేశాలు ఇచ్చా రన్నారు. నేమకల్లు సమగ్రాబి వృద్ధికి కూడా నివేదికను తయారుచేయాలని కలెక్టర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. డి.హీరేహాళ్ మండల కేంద్రానికి పడమరవైపున పక్లిలేషన్ ట్యాంకు నిర్మాణం చేయాలని కోరగా ఇందుకు కూడా సంమతిం చారన్నారు. దీని వల్ల ఆ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటై జీవనోపాధి మెరుగుపడేందుకు అవకాశం ఉంద న్నారు. నేమకల్లు నుండి హిర్దేహాళ్, హీరేహాళ్ వరకు 1000ఎకరాల విస్తీర్ణంలో చిన్న పాటి పరిశ్రమలు ఉన్నాయని, గతంలో 750ఎకరా లకు కుదిరేముక్ పరిశ్రమకు కేటాయిస్తే వారు దాని ఏర్పాటుకు ముందుకు రాని కారణంగా ఆ భూములను వెన్నకు తీసుకోవడంతో పాటు మరో 1000 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, 2500 నుండి 3వేల ఎకరాల్లో స్టీల్ పరిశ్రమల ఏర్పాటు పార్కు మంజూరు చేయాలని కోరగా ఆయన సమతించా రన్నారు. ఇన్ని వరాలు ఆరు నెలల కాలంలో ఏ నియో జకవర్గానికి ఇవ్వలేదని, మనకే ఇచ్చాడని, మనమన్న, మన ప్రాంత ప్రజ లన్న ఈ ప్రాంతమన్న మెరుగుబాటు తనమన్న ముఖ్యమంత్రికి అంత బాధ్య తగా ఉంది కాబట్టి రాయదుర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిం చాలనే ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా తగిన కార్యాచరణతో మంత్రులు, అధికారుల సహకారంతో రానున్న నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఈ నియోజ కవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి నేను శక్తివంచన లేకుండా శ్రమిస్తానని ప్రజలకు మాట ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలో ఏ ఎమ్మెల్యేలకు రానటువంటి మెజార్టి నాకు ఇచ్చి, నన్ను అబిమాని ంచి, నన్ను గౌరవించి గెలిపించిన రాయదుర్గం ప్రజల రుణం తీర్చుకోవ డానికి, ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసా, ఆయన ఇచ్చిన వరాలు నాలో ఆత్మవిశ్వానివ్వడంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయని నేను భలంగా నమ్ముతున్నానన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శ నంలో మంత్రులు, అధికారుల సహకారంతో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్ని కూడా నెరవేర్చడానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ప్రజలకు ఆయన మనవిచేశారు.

# ప్రజలపై రూ.15,485 కోట్లు భారంమోపి వంచించిన చంద్రబాబు

## - ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి మోసం - రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా దగా చేస్తున్న ప్రభుత్వం - ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి


వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 1 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలపై 15,485 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారం మోపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వంచిం చిందని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరా మిరెడ్డి ధ్వజమెత్తారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు సతమతమవుతుంటే పట్టించుకోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడవకముందే రెండోసారి విద్యుత్ చార్జీలను పెంచిందని మండిపడ్డారు. 5 సంవత్సరాలు విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ముందు హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చాక కేవలం 6 నెలల కాలం లోనే ప్రజలను వంచించారని ఎద్దేవా చేశారు. దీపావళి పండుగకు ముందే ట్రూ ఆఫ్ చార్జీ ల పేరుతో 6,072 కోట్ల రూపాయలు, ఇప్పుడు ఇంధన సర్దుబాటు పేరుతో ఏకంగా 9,412 కోట్ల రూపాయలు భారం మోపార న్నారు. వచ్చే ఏడాది జనవరి నెల నుండి ఒక్కో యూనిట్‌కు 2.19 రూపాయ లు అదనపు భారం వినియోగదారులపై పడనుందన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

**ఉచిత పంటల బీమాకు మంగళంపాడిన ప్రభుత్వ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పాడి రైతులకు నష్ట చేస్తోందని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి మండిప డ్డారు. ఇప్పటికే రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని విమర్శించారు. మాట తప్పడం తద్వారా సమస్యలు వచ్చిన పుడల్లా ప్రజల దృష్టిని మరల్చడంకోసం డైవర్షన్ పాలిటిక్స్ చేయ డం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తాజాగా విద్యుత్ చార్జీల పెంపు నకు గత ప్రభుత్వం, జగన్మోహన్‌రెడ్డే కారణమని కొత్త డ్రామాకు తెర లేపాం న్నారు. కరెంటు వాడకపోయినా 50 రూపాయలు కనీస చార్జీ వసూళు చేసే సంప్రదాయానికి తెర లేపారని విమర్శి ంచారు. విద్యుత్ బిల్లుల్లో శ్లాబ్ విధాన సృష్టికర్త కూడా చంద్రబాబేనని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. 2014-19 మధ్య కూడా చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచారని 76 యూనిట్ల విద్యుత్‌కు 2015-16లో 140.10 రూపాయలు బిల్లురాగా అది 2018-19 నాటికి 190 రూపాయలకు పెరిగిందని వివరిం చారు. పంటనష్ట జరిగితే పరిహారం చెల్లించాల్సి న అవసరం లేకుండా పంటలకు ఈ-క్రాప్ నమోదు కూడా ఆపేశారని వాపోయారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఉచిత పంటల బీమా పక్కాగా అమలుకాగా ఏ సీజన్‌లో పంటనష్టం జరిగితే ఆ సీజన్ ముగిసే లోగానే రైతులకు పరిహారం అందించేదని వివరి ంచారు. ఈ సమావేశంలో వైఎస్సా ర్‌సీపీ నాయకులు ఎం.వి. రమణ యాదవ్, రమణారెడ్డి, జయచం ద్రనాయుడు, కాకర్ల నాగేశ్వరరావు, నెరమెట్ల తిప్పారెడ్డి, జయేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, చెన్నబస న్నగౌడ్, శివలింగ, తిరుపాల్ యాదవ్, బోయ రాంబ బు, దిద్దేకుంట సూరి, మహాలింగ, రామచంద్ర, లాలెప్ప, గురుస్వామి, కేశన్న, ముష్టూరు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచి చంద్రబాబు ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోంది..!

## - కేవలం 6 నెలల పాలనలోనే రూ.15,485 కోట్ల భారం దారుణం - ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలపై భారం సరైందికాదు - మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.విశ్వేశ్వరరెడ్డి


మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రాకముందు చంద్రబాబునాయుడు రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని విద్యుత్ చార్జీల పేరిట ప్రజలను దోపిడి చేస్తున్నారని విమర్శించి అధికారంలోకి వచ్చిన 6 నెలలోపే 15,485 కోట్లరూపాయలు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం దారుణమని తద్వారా యూనిట్‌కు 2.19 రూపాయలు పెరిగిందని అన్నారు. దీపావళికు ముందు పెంచిన ట్రూ ఆఫ్ చార్జీల భారం 6,072.82 కోట్ల రూపాయలతో యూనిట్ ధర 1.27 రూపాయలు పెరుగగా ఇప్పుడు సర్దుబా టు చార్జీల పేరిట యూనిట్ ప్రజలపై 9,000 కోట్ల రూపాయల పెం చగా మరో 92 పైసలు భారం పడుతుందన్నారు.

సంపద సృష్టిస్తానని చెప్పే చంద్రబాబు ప్రజలపైన విపరీతమైన భారం మోపుతున్నారని విమర్శించారు. 6 నెలల పాలనలో 67,000 రూపాయలకు పైగా అప్పులు చేయడం తోపా టు ప్రజలపై మోయలేని భా రాలు మోపుతున్నారని వాపో యారు. ఎన్నికల సమ యం లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఊసే లేద న్నారు. అడపదడపాగా పిం ఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలెండర్ల అమలు తప్ప ఇతర హామీల అమలు చేయ లేదని విమర్శిచారు. ఒకవైపు ఇన్ని వేల కోట్ల రూపాయల అప్పులు ఎందు కు చేస్తున్నా రో.. మరో వైపు ఇన్ని వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై ఎందుకు మోపుతున్నాడో అర్ధం కావ డం లేదన్నారు. ప్రతిదానికి గత ప్రభుత్వమే కారణంటూ జగన్మోహ న్‌రెడ్డిను విమర్శించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వంవల్ల ప్రజలకు మంచి జరుగకపోగా నష్టం జరుగుతో ందని వాపోయారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

# జిల్లా కరువుపై నోరు మెదపని చంద్రబాబు

## - వచ్చారు.. వెళ్లారు.. అంతే.,.- రాయలసీమకు చంద్రబాబు ఏం చేశారు..

## - మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ ధ్వజం


: మాట్లాడుతున్న కాంగ్రెస్ మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ తదితరులు

అనంతపురం, నవంబర్ 1 ప్రభాతవార్త బ్యూరో

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతివృష్టి అనావృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయిన జిల్లా పర్యటనలో చంద్రబాబు స్పందించలేదని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ శైలజానాథ్ ధ్వజమెత్తారు. సభలో తాను చెప్పాల్సింది చెప్పాడు వెళ్లారు అంతేనని ఆయన వ్యాఖ్యానించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాకు సీఎం చంద్రబాబు రావడంతో ఆయన జిల్లాలో కరువు గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. సకాలంలో వర్షాలు కురవక తుఫాన్ లాంటివి జిల్లాలో రైతులు ఎంతో నష్టపోయారని ఇన్‌పుట్ సబ్సిడి, ఇన్సురెన్స్ లాంటివి వెంటనే ఇచ్చే ఏర్పాటు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. డిప్పులు, స్ప్రింక్లర్లు నూటికి నూరు శాతంతో రైతాంగా నికి ఏమైనా ఇచ్చి వెళ్లారా అని రైతన్నలు ఎదురు చూశారని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వచ్చారు చెప్పదల్సింది చెప్పారు. బయల్దేరివెళ్లిపోయా రని మండి పడ్డారు. మాలాంటి వాళ్లకు కూడా ఒక అడుగు ముందుకేసి కూడా చెప్పాం. రాయలసీమకి ఏమన్నా చేస్తారా అయినా కూడా రాయల సీమ గురించి ప్రత్యేకంగా ఏమి మాట్లాడలేదన్నారు. ప్రజాప్రతినిధులు కూడా మా నుంచి విజ్ఞప్తి చేసుకుంటు న్నాం. అనంతపురం అభి వృద్ధి అంటే రైతు అభివృద్ధి అన్నారు. రాయలసీమ అభి వృద్ధి అంటే యువకులకు రైతులకు వివిధ వర్గాలకు జీవి తంలో కలిగే మంచి మార్పు ఇలాంటివి ప్రకటిస్తారేమో అని అనత పురం ప్రజలు రైతులు ఎదురు చూశారన్నారు. గతం లో కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగినంత అభివృద్ధి ఏ ప్రభుత్వం లోనూ జర గలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్లపల్లి ప్రత ాప్‌రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కావు గాజుల వాసు, ఓబిసి జిల్లా మాజీ అధ్యక్షులు రామ్ చరణ్ యాదవ్, మైనార్టీ నగర్ అధ్యక్షు లు హానిగా శర్మష వలి, బికె.సురేష్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొర్రపాడు పరమే శ్వరరెడ్డి, ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్, కోఆపరేటివ్ డిపార్ట్మెంట్, పోస్టల్ డిపార్ట్మెంట్ జట్ల విజయం

## అర్ధ సెంచరీలతో కదంతొక్కిన దుర్గేష్, షాషావలిబౌలింగ్ లో సత్తా చాటిన చంద్ర, సుబ్బారాయుడు, భూషణ్



మాన్ అఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న దృశ్యం


విజేతగానిలిచిన జట్టు

అనంతపురం క్లాక్ టవర్. డిసెంబర్ 1,ప్రభాతవార్త

:ఆంధ్రప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్ర ర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ 2024లో భాగంగా పంచాయతీరాజ్, జేఎన్టీ యూ జట్లు తలబడ్డాయి టాస్ గెలిచిన జేఎన్టీయూ బ్యాటింగ్ ఎంచు కుంది నిర్ణిత 20 ఓవర్లలో 154 పరు గులు చేసి 6 వికెట్లు కోల్పోయి ంది. తిరుమ లేశు 36 బంతుల్లో 1 సిక్స్ 2 ఫోర్లతో 43 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు, గోపాల్ రెడ్డి 16 బంతుల్లో 5 ఫోర్లతో 21 పరుగులతో ఆకట్టుకు న్నాడు, రావు 30 బంతుల్లో 2 ఫోర్లతో 18 పరుగులు చేశారు. పంచాయతీ రాజ్ జట్టు బౌలర్లు జగ్గ, వెంకట్రాముడు, సాంబశివ, దుర్గ, శంకర్ ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. పంచాయతీ రాజ్ జట్టు 19.3 ఓవర్లలో 155/2 పరుగుల చేసి 8 వికెట్లతో విజయం సాధించింది. పంచాయతీ రాజ్ జట్టు బ్యాట్స మెన్ దుర్గేష్ చక్కటి బ్యాటింగ్ ప్రదర్శనతో 52 బంతుల్లో 5 ఐదు ఫోర్లుతో 51 పరుగులు సాధించి నాటౌట్ గా నిలిచాడు.

సాంబశివ 30 బంతుల్లో 3 ఫోర్లు 33 పరుగులు చేసి జట్టుకు విజ యాన్ని అందించారు జేఎన్టీయూ రుద్ర, భరద్వా జ ఒక్కొక వికెట్ తీసుకు న్నారు.అడ్వకేట్స్ వర్సెస్ పోస్టల్ డిపార్ట్మెంట్‌పోస్టల్ డిపార్ట్మెంట్, అడ్వకేట్స్ జట్ల మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అడ్వొకేట్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగుల కు 7 వికెట్లు కోల్పో యింది అశోక్ రెడ్డి 33 బంతుల్లో 6 ఫోర్లతో 45 పరుగులు, హుస్సే న్ 30, హనుమంతు 18, విక్రమ్ 17, అశోక్ 12 పరు గులు సాధించారు పోస్టల్ డిపార్ట్మెంట్ జట్టు బౌలర్లు శివ 2, తిరుపల్, మద్దిలేటి, నాగభూషణం, ప్రవీణ్, జైపాల్ ఒక్కొక్క వికెట్ తీసుకు న్నారు. 155 పరు గుల విజయ లక్ష్యాన్ని 17 ఓవర్లలో ఛేదిం చి 5 వికెట్ల తో విజయం సాధించారు ప్రశ ాంత్ 21 బంతులలో 3 సిక్సర్లు 1 బౌండరీ సహాయంతో 35 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రవీణ్ 40 పరుగులు నాగభూ షణం 23 పరు గులు చేశారు అడ్వొకెట్స్ జట్టు బౌలర్లు చంద్ర 3, రాం మోహన్ 1, అశోక్ ఒక్క వికెట్ తీసుకున్నాడు అనంతపురం ఆర్టీసి వర్సెస్ కోఆపరే టివ్ డిపార్ట్మెంట్‌ఆర్డీటీ బి గ్రౌండ్లో కో ఆపరేటివ్ డిపార్ట్మెంట్, అనంతపురం ఆర్టిసి జట్ల మధ్య పోటీలో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కోఆపరేటివ్ జట్టు మొదట బ్యాటింగ్ కి చేసిన అనంతపురం ఆర్టీసీ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 126 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. అనంత పురం ఆర్టీసీ ప్లేయర్ షాషావలి అద్భు తమైన ప్రదర్శనతో అర్ధ సెంచరీ సాధించాడు కేవలం 32 బంతుల్లో 3 సిక్సర్లు 4 ఫోర్లతో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు సాదిక్ 14, నిశాంత్ కుమా ర్ 13, జోసెఫ్ 12, సుబ్బరాయుడు 10 పరుగు లు చేశారు. కోఆపరేటివ్ జట్టు బౌలర్లు మురళి 2, సాయి 2 భాస్కర్, మారుతి చెరో ఒక వికెట్ తీసు కున్నారు. 128 పరుగుల విజయలక్ష్యాని 15.1 ఛేదించి 1 వికెటతో విజ యం సాదించారు. నవీన్ 39 భాస్కర్ 33 పరుగులు చేశారు అనంతపురం ఏపీఎస్ఆర్టీసీ బౌలర్లు సుబ్బరాయుడు 3 వికెట్లు భూషణ 3 వికెట్లు నిశాంత్ ఒక వికెట్ తీసుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్యులతో పాటు ముగ్గురు దుర్మరణం

## - విడపనకల్ వద్ద ఘటన - బళ్లారి వైద్యవర్గాల్లో విషాధం


విడపనకల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బళ్లారి వైద్యులు

బళ్లారి, డిశంబర్01, ప్రభాతవార్త; ఆదివారం ఉదయం 5;30 గంటలకు అనంతపురం జిల్లా విడనపకల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు వైద్యులతో పాటు ఒక న్యాయవాది మృతిచెందారు. మరొకరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. మృతిచెందిన వారిలో బళ్లారి బిమ్స్ ఆస్పత్రిలో కేన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ గోవిందరాజులు(52), కంటి వైద్య నిపుణులు డాక్టర్ యోగీష్(54), స్థానిక న్యాయవాది వెంకటనాయుడు (53) అక్కడికక్కడే మృతిచెందగా, మరొక వైద్యుడు డాక్టర్ అమరేగౌడ పాట ిల్(55), తీవ్రంగా గాయడగా, అతడిని చికిత్సకై తరలించా రు. వీర ంతా బ్యాంకాక్ పర్యటన ముగించుకుని బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగి అక్కడి నుంచి కారులో అనంతపురం మీదుగా బళ్లారికి వస్తుండగా విడపన కల్ గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో కారు ముందుభాగం ధ్వంసమై కారులో ఉన్న వీరందరూ తీవ్ర గాయాలకు గురై ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన అమరేగౌడ పాటిల్‌ను అతికష్టం మీద కారులో నుంచి బయటకు తీసి చికిత్స కోసం వెంటనే ఆస్పత్రికి తరలించారు. విడపనకల్ పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం బిమ్స్ ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. ఈ ఘటనతో బళ్లారి వైద్య వర్గాల్లో విషాధం నింపింది. డాక్టర్ గోవిందరాజులు కేన్సర్ రోగుల కు ఉత్తమ చికిత్స ఇవ్వడంలో ఖ్యాతి పొందారు. నిరుపేద రోగ ులకు వైద్యం చేసేవాడని తెలిసి ంది. ప్రమాదం జరిగే సమయ ంలో వెంకట నాయుడు కారును డ్రైవింగ్ చేస్తున్నట్లు, నిద్ర మత్తు ఆవరించడం తోనే వారు ప్రయా ణిస్తున్న కారు రోడ్డు నుంచి ఎ క్కకు వచ్చి చెట్టును ఢీకొన డం వల్లే ఈ ప్రమాదం జరిగిం దని కేసు నమోదు చేసుకున్న విడప నకల్ పోలీసుల సమాచారం.

# జిసిటిఎ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం )ఎన్నిక


ఎన్నికైన జిసిటిఎ నూతన కమిటీ

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సం ఘం (జిసిటిఎ) ఎన్నికలు ప్రభు త్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగా యి. దాదాపు 100 మంది అధ్యాపకులు హాజర య్యారు. అనంతపురం జిల్లా జిసిటిఎ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కోనంకి శ్రీధర్ 50 ఓట్లమెజార్టీతో వెంకటేష్( ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు)పై గెలుపొందారు. ఉమెన్ సెక్రెటరీగా డాక్టర్ శ్రీలేఖ 288 ఓట్లతో (విష్ణుప్రియ)పై గెలుపొందారు. జిల్లా కార్యదర్శిగా బాలాజీ నాయక్, జిల్లా ట్రెజరర్‌గా డాక్టర్‌నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జయప్ప పాల్గొన్నారు.

# శ్రీకాశీవిశ్వేశ్వరునికి భస్మాభిషేకం

## - పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

కార్తీకమాసం ఆమావాస్యను పురస్కరించుకుని పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీకాశీవిశ్వేశ్వరునికి ఆదివారం అర్చకులు భస్మాభిషేకం గావించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఇందులో భాగంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం భస్మంతో అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రె డ్డిని అర్చకులు సత్కరించి ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందచేశా రు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మ, చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మ, మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పరిశే చంద్రశేఖర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలలో గ్రీవెన్స్ డే కార్యక్రమం

## - వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్


మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, ఈనెల మూడో తేది నుంచి 31వ తేది వరకు సచివాలయ సిబ్బందితో కలిసి ధర్మవరం నియోజకవర్గంలో గ్రీవెన్స్ డేని నిర్వహించ నున్నట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా 3 తేది మంగళవారం కార్యక్రమం తాడిమర్రిలో ప్రారంభమవుతుంది. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను, అవగాహన దారితీసే అంశాలను సులభం గా రిజిస్టర్ చేసుకోగలుగుతారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి మంత్రి, సంబంధిత అధి కారులు నిబద్ధతతో పని చేస్తారని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వారి సమస్యలకు సమగ్ర పరిష్కారాలు అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఉం టుం ది అని అన్నారు. కావునప్రజలు ఈ అ వక ాశాన్ని సద్వినియోగం చేసుకు త మ సమస్యలను తెలియజే యాలని మంత్రి సిబ్బంది కోరారు.

# కూటమి ప్రభుత్వ హామీల అమలుకై ఉద్యమిస్తాం : ఏపిటిఎఫ్ నేతలు



మాట్లాడుతున్న ఏపిటిఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

ఏపిటిఎఫ్ జిల్లా సబ్‌కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన స్థానిక పొట్టి శ్రీరాములు నగర పాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.రఘురాంరెడ్డి పూర్వ కార్యదర ఇశ బి.నరసింహులు రాష్ట్రకార్యదర్శి జి.పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షులురాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు ఉన్నటువంటి సమస్యలన్నింటిని పరిష్కరిస్తావ న్నారన్నారు. కావున వెంటనే వాటినిపరిష్కారానికై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులునాగరాజు మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, కార్యదర్శిలు రామాంజినేయులు, నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణను కలిసిన ఆల్ మేవా నాయకులు


ఎంపిని సన్మానిస్తున్న ఆల్ మేవా నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణను ఆదివారం ఉదయం అనంతపురంలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎంపిని వివరిస్తూ పార్లమెంట్ సమావేశాలలో ముస్లిం మైనార్టీ సమావేశానికి సంబంధించి వక్ఫ్ బోర్డు బిల్లుకు తెలుగుదేశం పార్టీ తరపున బిల్లు ప్రవేశ పెట్టకుండా వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఉద్యోగుల సంక్షేమం జిల్లా అధ్యక్షులు షేక్షావలి, జీలాన్ అబ్దుల్ రసూల్, మహబూబ్‌బాషా, దౌలా తదితరులు పాల్గొన్నారు.